నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, ఆదివారం 7 జనవరి 2024 | NIZAMABAD

ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

ఇందల్వాయి, జనవరి 6: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఐదో తరగతి (2024-25)లో ప్రవేశాలకు నిర్వహించనున్న పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల గడువును ఈనెల 20 వరకు పొడిగించినట్లు ప్రాంతీయ సమన్వయకర్త అధికారిణి అలివేలు తెలిపారు. ఈ మేరకు గురుకుల ప్రవేశాలకు సంబంధించిన గోడ ప్రతులను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తన చాంబర్‌లో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అలివేలు మాట్లాడుతూ..2023-24 విద్యా సంవత్సరంలో ఏదైనా ప్రభుత్వం లేదా గుర్తింపు పొందిన పాఠశాలల్లో 4వ తరగతి చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీలకు చెందిన విద్యార్థులు ఈ ప్రవేశపరీక్ష రాయడానికి అర్హులని పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు www.tswreis.ac.in వెబ్‌సైట్ ద్వారా రూ.100 రుసుము చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 11న ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు ప్రవేశపరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. పరీక్ష తేదీకి పదిరోజుల ముందు నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షలో కనబర్చిన ప్రతిభ ఆధారంగా ఎంపి క ఉంటుందని తెలిపారు.

చివరి రోజు.. మధ్యాహ్నం వరకే..

కామారెడ్డి జిల్లాకేంద్రంలోని 49వ వార్డులో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాటు చేసిన కేంద్రమిది. చివరి రోజు శనివారం మధ్యాహ్నం వరకు దరఖాస్తులు స్వీకరించిన అధికారులు, సిబ్బంది భోజన విరామం తర్వాత సెంటర్‌లో కనిపించలేదు. దీంతో దరఖాస్తులు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు నిరాశగా వెనుదిరిగారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసినప్పటికీ స్పందించలేదు.
– కామారెడ్డి, జనవరి 6

7.85 లక్షలు

ఉమ్మడి జిల్లాలో వచ్చిన ప్రజాపాలన దరఖాస్తులు

ఖలీల్‌వాడి/కామారెడ్డి, జనవరి 6: ప్రజాపాలన సభలు శనివారం ముగిశాయి. డిసెంబర్ 28న రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. శనివారం వరకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 7,85,974దరఖాస్తులు వచ్చా యి. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 4,77,808 దరఖాస్తులను ప్రజల నుంచి అధికారులు స్వీకరించారు. జిల్లాలో 530 జీపీలు, మూడు మున్సిపాలిటీల్లోని 146 వార్డుల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి దరఖాస్తులను తీసుకున్నారు. ఆర్మూర్ 56,814, బాల్కొండ 87,212, బాన్సువాడ 41,689, బోధన్ 58,931, నిజామాబాద్ రూరల్‌లో 93,634 దరఖాస్తులు వచ్చాయి. కాగా మున్సిపాలిటీల పరిధిలో 1,39,528, పంచాయతీల్లో 3,38,280 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కామారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు 3,08,166 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా 526 జీపీలు, 80 మున్సిపల్ వార్డుల్లో దరఖాస్తులను స్వీకరించారు. చివరి రోజు 41,370 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

రానున్న లోక్‌సభ ఎన్నికలకు భారత రాష్ట్ర సమితి ఇప్పటి నుంచే సన్నద్ధమవుతున్నది. పార్టీ గెలుపే లక్ష్యంగా అనుసరించాల్సిన వ్యూహాలకు పదును పెడుతున్నది. ఈ మేరకు లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ఆ పార్టీ నాయకత్వం సమీక్షలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే పలు నియోజకవర్గాల సమీక్షలు పూర్తయ్యాయి. నేడు (ఆదివారం) జహీరాబాద్, రేపు నిజామాబాద్ లోక్‌సభ సెగ్మెంట్లకు సంబంధించిన నాయకులతో రివ్యూ నిర్వహించనున్నది. రెండు నియోజకవర్గాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ముఖ్య నాయకులతో చర్చించనున్నది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, వచ్చే లోక్‌సభ ఎన్నికలపై పార్టీ నాయకుల అభిప్రాయాలు సేకరించనున్నారు.
–నిజామాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

గెలుపే లక్ష్యంగా..



- నియోజకవర్గాల వారీగా సమీక్షలు
- నేడు జహీరాబాద్, రేపు నిజామాబాద్ సెగ్మెంట్ల రివ్యూ
- హాజరు కానున్న పార్టీ ముఖ్యులు, ఉమ్మడి జిల్లా నేతలు
- ఎలక్షన్లలో అనుసరించాల్సిన ప్రణాళికల రూపకల్పన
- విజయం కోసం వ్యూహరచన చేయనున్న నాయకులు

లోక్‌సభ ఎన్నికలకు బీఆర్ఎస్ సన్నాహాలు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలో ఉన్న నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ సమీక్షలు నేడు, రేపు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరుగనున్నాయి. వాస్తవానికి తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆదివారం నిజామాబాద్, సోమవారం జహీరాబాద్ సెగ్మెంట్‌కు సంబంధించిన రివ్యూ ఉంది. కానీ అనుకోని కారణాలతో నిజామాబాద్ సమీక్ష సమావేశం ఒక రోజు (సోమవారానికి) వెనక్కి వెళ్లింది. ఆదివారం జహీరాబాద్ సమావేశం జరుగనున్నది. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై సమీక్షించనున్నారు. అలాగే, పార్టీ నేతల అభిప్రాయాల సేకరణతో పాటు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలను ఖరారు చేయనున్నారు.

వ్యూహాలకు పదును..

కీలకమైన నిజామాబాద్ లోక్‌సభ స్థానం ఎంతో విభిన్నమైనది. 2014 ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఇక్కడ జయకేతనం ఎగుర వేసింది. స్వరాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్‌కే ప్రజలంతా పట్టం కట్టారు. ఎంపీగా కల్వకుంట్ల కవిత విజయం సాధించి తెలంగాణ నుంచి తొలి మహిళా ఎంపీగా పార్లమెంట్‌లో అడుగు పెట్టారు. వాస్తవానికి నిజామాబాద్ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ (ఆర్మూర్, బోధన్, బాల్కొండ, నిజామాబాద్ అర్బన్, రూరల్, కోరుట్ల, జగిత్యాల) సెగ్మెంట్లలో బీఆర్ఎస్‌కు గట్టి పట్టు ఉన్నది. గత శాసనసభ ఎన్నికల్లో అన్నిచోట్లా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే గెలుపొందారు. అయితే, తెలంగాణ రాష్ట్రం నుంచి తొలి మహిళా ఎంపీగా ఎన్నికై చరిత్ర సృష్టించిన కవితను ఎలాగైనా ఓడించాలని గత లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్, బీజేపీ చేతులు కలిపాయి. కనీసం పోటీ ఇవ్వకుండా చేతులెత్తేసిన కాంగ్రెస్.. బీజేపీకి నేరుగా మద్దతు పలికి బీఆర్ఎస్‌ను దెబ్బతీసింది. ఈ రెండు జాతీయ పార్టీలు వైరం ఉన్నట్లుగా బయటకు నటిస్తున్నప్పటికీ, గత ఎన్నికల్లో ఇక్కడ మాత్రం దోస్త్ మేరా దోస్త్ అన్నట్లుగా చేయి కలపడం చర్చనీయాంశంగా మారింది. ఈ అనైతిక పొత్తును స్థానిక ప్రజానీకమంతా గమనించడంతో పాటుగా ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన అనుభవాల నేపథ్యంలో తిరిగి బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలిపేందుకు సిద్ధం అవుతున్నట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు గెలుపు అవకాశాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోకుండా రానున్న కొద్ది రోజుల్లోనే క్షేత్ర స్థాయిలో ప్రజల మద్దతును కూడగట్టేందుకు బీఆర్ఎస్ కార్యాచరణను సిద్ధం చేస్తున్నది.

ఉత్సాహం నింపేలా..

జహీరాబాద్, నిజామాబాద్ లోక్‌సభ సెగ్మెంట్లలో బీఆర్ఎస్‌కు తొలి నుంచి మంచి పట్టు ఉన్నది. ఏ పార్టీకి లేనంత బలమైన కేడర్ కూడా గులాబీ పార్టీకి ఉంది. అయితే, గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో కొన్ని చోట్ల ఊహించని విధంగా ప్రతికూల ఫలితాలు వచ్చాయి. శాసనసభ ఎన్నికల తర్వాత కొంత నైరాశ్యంలో ఉన్న పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపేలా బీఆర్ఎస్ చర్యలు చేపట్టింది. రెండు లోక్‌సభ స్థానాల్లో విజయమే ధ్యేయంగా వ్యూహరచన చేయనున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో వెలువడిన అనూహ్య ఫలితాల నేపథ్యంలో ఈ సమీక్ష సమావేశాలు పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్తేజాన్ని ఇవ్వబోతున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీ తీరును ఎండగట్టడంతో పాటుగా సామాన్య ప్రజలకు అండగా నిలవాల్సిన అంశాలపై సమీక్షలో చర్చించే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీల ద్వంద వైఖరిని ప్రజలకు వివరించేలా బీఆర్ఎస్ కార్యాచరణ చేపట్టనున్నది. ఒక్కో రోజు ఒక్కో లోక్‌సభ నియోజకవర్గంపై పూర్తి స్థాయి సమీక్ష ఉంటుండడంతో పార్లమెంట్ స్థానంలో పరిధిలో 7 అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు, ముఖ్య నాయకులతో కేటీఆర్ నేరుగా సమావేశమవుతున్నారు.

జహీరాబాద్‌లో హ్యాట్రిక్ కొట్టేలా..

జహీరాబాద్ లోక్‌సభ స్థానంలో హ్యాట్రిక్ విజయం సాధించడంపై బీఆర్ఎస్ గురి పెట్టింది. 2014, 2019 ఎన్నికల్లో ఇక్కడ గులాబీ పార్టీ అభ్యర్థి బీబీపాటిల్ వరుసగా గెలుపొందారు. కేసీఆర్ ఆశీస్సులతో రాజకీయ అరంగేట్రం చేసిన ఆయనను ఈ ప్రాంత ప్రజలు రెండుసార్లు గెలిపించారు. ఇదే క్రమంలో మూడోసారి విజయం సాధించడంపై బీఆర్ఎస్ దృష్టి సారించింది. జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ కేంద్రం భౌగోళికంగా సంగారెడ్డి జిల్లాలో ఉన్నప్పటికీ, దీని పరిధిలోని నాలుగు అసెంబ్లీ (కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్) నియోజకవర్గాలు మాత్రం కామారెడ్డి జిల్లాలోనే కొనసాగుతున్నాయి. జహీరాబాద్ లోక్‌సభ పరిధిలో బీఆర్ఎస్‌కు ఆది నుంచి పట్టుంది. ఎంపీ ఎన్నికల్లో ఈసారి కూడా విజయం సాధించడం ద్వారా హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేయాలన్న ఆలోచనతో పార్టీ వ్యూహాలు రచిస్తున్నది. నేడు జరుగనున్న సమావేశానికి మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలను పిలిచారు. అలాగే, జిల్లాకు చెందిన ముఖ్య నాయకత్వమంతా పాల్గొనబోతోంది. లోటుపాట్లపై లోతుగా విశ్లేషించి భారీ మెజార్టీ కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించనున్నట్లుగా తెలుస్తోంది.

వందరోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలుచేస్తాం..

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు
రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

కుర్తి గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పిట్లం/రుద్రూర్/నిజాంసాగర్/ బిచ్కుంద, జనవరి 6: సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలుచేస్తామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం ఆయన ఉమ్మడి జిల్లాలో పర్యటించారు. ఇందులో భాగంగా పిట్లం మండలం కుర్తి,బిచ్కుంద మండలం ఎల్లారం తండా,

కోటగిరి మండలంలోని కొత్తపల్లి గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చి నెల రోజులు కూడా గడవక ముందే రెండు హామీలను ప్రజలకు అందజేశామని తెలిపారు. మిగితా హామీలను కూడా త్వరలో అమలుచేస్తామని స్పష్టం చేశారు. పేదలను ఆదుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. ప్రజలు ఆందోళన చెందవద్దని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో జుక్కల్, నారాయణఖేడ్ ఎమ్మెల్యేలు లక్ష్మీకాంతారావు, సంజీవరెడ్డి, కలెక్టర్లు జితేశ్ వీ పాటిల్, రాజీవ్‌గాంధీ హన్మంతు, కామారెడ్డి జడ్పీ సీఈవో సాయాగౌడ్, నిజామాబాద్ డీసీవో సంహాచలం, డీపీవో జయసుధ, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కౌలాస్ కోటకు నిధులు మంజూరు చేస్తాం

జుక్కల్ మండలంలోని కౌలాస్ గ్రామ శివారులో ఉన్న చారిత్రక కౌలాస్ కోటకు నిధులు మంజూరు చేస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం ఆయన జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావుతో కలిసి కౌలాస్ కోటను సందర్శించారు. కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, కౌలాస్ కోట రాజ వంశీకులైన అనూప్ సింగ్, అనితాసింగ్ కౌలాస్ కోట చరిత్రను మంత్రికి వివరించారు. కౌలాస్ కోట చిత్రాలతో కూడిన ఫొటోలను మంత్రికి చూపించారు. ఘన చరిత్ర కలిగిన కోటను పరిరక్షించడమే కాకుండా ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

ఏ ఒక్కరికీ అన్యాయం జరగవద్దు

డాటా ఎంట్రీ కేంద్రాలను పరిశీలించిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్/రెంజల్/నవీపేట/ఎడపల్లి, జనవరి 6: రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన 'ప్రజాపాలన' కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తుల డాటా ఎంట్రీని జాగ్రత్తగా నమోదు చేయాలని, దరఖాస్తు ఇచ్చిన ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బోధన్, రెంజల్, నవీపేట, ఎడపల్లి మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన డాటా ఎంట్రీ కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 69 వేల కుటుంబాలు ఉండగా, ఇప్పటి వరకు 72వేల దరఖాస్తులు వచ్చాయని, పెద్ద కుటుంబాలు విడిపోవడంతో దరఖాస్తులు పెరిగి ఉంటాయని అన్నారు. బోధన్ మున్సిపాలిటీతోపాటు ప్రతి మండలానికి ఒక్కో డాటా ఎంట్రీ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ఈ కేంద్రాల్లో మొత్తం 180 కంప్యూటర్లలో ఆన్‌లైన్ నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా మండల కేంద్రాల్లో ప్రభుత్వ పనులపై ఆరా తీశారు.

ఇందూర్ బీఈడీ కళాశాలలో ఏర్పాటుచేసిన 'ప్రజాపాలన' డాటా ఎంట్రీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ప్రజాపాలనలో దరఖాస్తులను స్వీకరిస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సుపరిపాలన అందించడమే లక్ష్యం

రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ధర్పల్లి, జనవరి 6: రాష్ట్రంలో సుపరిపాలన అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రూరల్ ఎమ్మెల్యే రేకుల భూపతిరెడ్డి అన్నారు. ఆరు గ్యారెంటీ పథకాలను పక్కాగా అమలుచేస్తామని స్పష్టం చేశారు. శనివారం ఆయన ధర్పల్లి మండల కేంద్రంలో పర్యటించారు. పోలీస్‌స్టేషన్ పక్కన చెరువు కట్ట రోడ్డు వద్ద రజకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందేలా పనిచేస్తామన్నారు. ప్రజలు ఆరు గ్యారెంటీలకు సంబంధించి తప్పకుండా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కొంతమంది అధికారులు ఇంకా గత ప్రభుత్వ నాయకుల మాటలే వింటున్నారని, తీరు మార్చుకోవాలని సూచించారు. మూడు నెలల్లో తీరు మార్చుకోకుంటే వేరుగా ఉంటుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పలు సమస్యలను పరిష్కరించాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే గురడిరెడ్డి సంఘంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. పార్టీ శ్రేణులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ నల్ల సారిక, సర్పంచ్ ఆర్మూర్ పెద్దబాల్‌రాజ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాల్‌రాజ్, నాయకులు గాదారి మనోహర్‌రెడ్డి, మిట్టాపల్లి గంగారెడ్డి, రామడ్లు మహేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అర్వింద్‌కు రైతుల మొర

పొలాల మీదుగా ఎక్స్‌ప్రెస్ హైవే వద్దు..

వేల్పూర్, జనవరి 6: 'తాము పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం... పెర్కిట్ నుంచి మంచిర్యాల్ వరకు కేంద్రం నూతనంగా వేయనున్న నాలుగు లైన్ల ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డును పొలాల నుంచి తీయడంతో విలువైన భూములను కోల్పోతున్నాం..' అని వేల్పూర్ మండలం అంక్సాపూర్ రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. పెర్కిట్‌లోని క్యాంప్ ఆఫీస్‌లో ఎంపీ అర్వింద్‌ను శనివారం కలిశారు. వ్యవసాయ సాగులో పేరు ప్రతిష్టలను పొందిన అంక్సాపూర్ గ్రామం గుండా హైవే రోడ్డు ఏర్పాటుతో తాము భూములను కోల్పోతున్నామని, వీటి ప్రతిపాదనలను వెంటనే రద్దు చేయించాలని ఎంపీకి విన్నవించారు. ప్రస్తుతం ఉన్న రోడ్డునే విస్తరించాలని, పంట పొలాల నుంచి రోడ్డును వేయొద్దని శనివారం గ్రామసభ నిర్వహించి ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు చెప్పారు. ఆ తీర్మాన పత్రాన్ని గ్రామస్తులు, రైతులు ఎంపీ అర్వింద్‌కు అందజేశారు.

ఎంపీతో మాట్లాడుతున్న అంక్సాపూర్ గ్రామ రైతులు, గ్రామస్తులు

గడి కోట ఆధ్వర్యంలో తెలుగు సాహిత్య సదస్సు

సదస్సులో ప్రసంగిస్తున్న వక్త

హాజరైన ప్రముఖులు, రచయితలు

దోమకొండ, జనవరి 6: దోమకొండ గడీకోట సంస్థానాధీశుల వారసులైన కామినేని శోభనా అనిల్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం 'తెలుగు సాహిత్య సదస్సు' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగు సాహితీ అభ్యున్నతికి సేవలు అందించిన, అందిస్తున్న పండితులు, రచయితలు, సాహితీ పరిశోధకులు, కవులు హాజరయ్యారు. తెలుగు సాహితీ వైభవంపై వక్తలు ప్రసంగించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా దోమకొండ గడీకోట ట్రస్ట్ ఆధ్వర్యంలో శిక్షకురాలు హిమబిందు వద్ద కూచిపూడిలో శిక్షణ తీసుకుంటున్న చిన్నారులతో నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఆచార్య తంగెడ కిషన్ రావు, ఎన్ జయరామారెడ్డి, ఏనుగు నర్సింహారెడ్డి, ఈ శివనాగిరెడ్డి, వైద్యం వెంకటేశ్వరాచార్యులు, కుర్ర జితేంద్ర బాబు, అనంతకుమార శర్మ, అయాచితం నటేశ్వర శర్మ, మామిడి హరి కృష్ణ, గడీకోట ట్రస్ట్ మేనేజర్ బాబ్జి, 14 సంస్థానాల నుంచి వచ్చిన సాహిత్య సేవకులు, వక్తలు, కవులు, దోమకొండ గ్రామ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉద్యోగ మేళా

నిజామాబాద్ స్పోర్ట్స్, జనవరి 6 : జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల 8వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులు జిల్లాకేంద్రంలోని శివాజీనగర్‌లోని ఉపాధి కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ఉద్యోగ మేళాలో పాల్గొనాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9581768413, 9948748428, 9959456793 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

సామాజిక సేవలు అభినందనీయం

నగరంలోని జోస్ ఆలుక్కాస్ జువెల్లరీ షోరూం ప్రథమ వార్షికోత్సవాన్ని బ్రాంచ్ మేనేజర్ స్మితీశ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మేయర్ నీతూకిరణ్ హాజరై కేక్ కట్ చేశారు. జోస్ ఆలుక్కాస్ ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధులు సుమారు రూ.2,41,338 వెచ్చించి కొనుగోలు చేసిన స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సామగ్రి చెక్కును బొమ్మన్ దేవునిపల్లి జడ్పీపీఎస్ ప్రతినిధులకు అందజేశారు. షోరూంలో అందజేస్తున్న ఆఫర్లను ప్రతినిధులు వివరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు అలెక్స్, సజేశ్, పిప్పెర నరేందర్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మోటూరి మురళీగుప్తా, కార్పొరేటర్లు పాల్గొన్నారు.
– ఖలీల్‌వాడి, జనవరి 6